ఊర్లుగా మారుతున్న జగనన్న కాలనీలు..

- జమ్మలమడుగు నియోజకవర్గంలో ఆరు మండలాల్లో రూ.63.51 కోట్ల వ్యయంతో 11,060 ఇళ్ల నిర్మాణాలు
- పూర్తైన ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ

జమ్మలమడుగు నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణాలు ఇలా..

మండలం	మంజూరైన ఇళ్లు	నిధులు (రూ.కోట్ల)
జమ్మలమడుగు (రూరల్)	1334	6.72
జమ్మలమడుగు టౌన్	3306	18.63
ఎర్రగుంట్ల టౌన్	1483	8.91
ఎర్రగుంట్ల రూరల్	1109	7.63
మైలవరం	1958	8.97
ముద్దనూరు	1118	8.67
పెద్దముడియం	644	3.37
కొండాపురం	108	0.59


జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు


పూరైన జగనన్న ఇళ్లు

ఎర్రగుంట్ల : జమ్మలమడుగు నియోజకవర్గం వ్యాప్తంగా జగనన్న కాలనీలు గ్రామాలుగా రూపుదిద్దుకుంటున్నాయి. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న గృహ యజ్ఞం వేగం పుంజుకుంది. గత 7 దశాబ్దాల కాలంలో ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వం అర్హతే ప్రమాణికంగా లబ్ధిదారులకు స్థలాలు అందించడమే కాకుండా పక్కాగృహాలు నిర్మాణం చేపట్టింది. త్వరలో నిర్మాణాలు పూర్తికానుండటంతో లబ్ధిదారుల మోములో ఆనందం వెల్లివిరుస్తోంది. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొదటి దశలో రూ.63.51 కోట్ల వ్యయంతో 11,060 గృహాలు నిర్మాణాలు చేపట్టారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఇళ్ల నిర్మాణలు శరవేగంగా జరుగుతున్నాయి. గత ప్రభుత్వం హాయాంలో మండలానికి పదోపాతిక ఇళ్లు కేటాయించేవారు. ప్రతిపక్షాలు ఇళ్లను చూసి పచ్చమీడియా ద్వారా అవాస్తవాలను చూపిస్తూ రాద్ధాంతం చేస్తున్నాయని లబ్ధిదారులు చెబుతున్నారు. ఎక్కడ గృహ నిర్మాణాలు జరిగాయన్న విషయం కూడా తెలిసేది కాదన్నారు. కళ్ల ముందే జగనన్న ఇళ్లు ఊర్లుగా మారుతున్నాయన్నారు. ఎర్రగుంట్ల, ముద్దనూరు, కొండాపురం, జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం మండలాల్లో స్లాబ్ పూర్తి అయిన ఇళ్లకు తలుపులు, కిటికీలు అమర్చుకునే పనుల్లో లబ్ధిదారులు బిజీగా ఉంటున్నారు.

ఏన్నో ఏళ్ల నాటి కల జగనన్నతో నెరవేరింది..



మాకు ఎన్నో ఏళ్లనాటి సొంతంటి కల నెరవేరింది. ఇళ్లు మంజూరు చేసి నిర్మించారు. ప్రస్తుతం అదే ఇంటిలో మేం నివాసం ఉంటున్నాం. మాకు బాడుగులు కట్టే బాధ తప్పింది. కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాం. మాకు ఇక రాదు అనుకున్న ఇంటిని జగనన్న ప్రభుత్వంలో మంజూరైంది. ఇప్పుడు మాకు సొంతిళ్లు ఉందంటూ గర్వంగా చెప్పుకుంటున్నాం.

తీట్ల నీతమ్మ (ఎర్రగుంట్ల పట్టణం)

క్లుప్తంగా

శేష వాహనంపై శ్రీరంగనాథుడు


శేషవాహనంపై శ్రీరంగనాథస్వామి

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీరంగనాథస్వా మి బ్రహ్మోత్సవాలలో భాగంగా పూలంగళ్ల వద్ద ఉన్న శ్రీరంగనాథస్వామి కాంప్లెక్స్‌లో ఘనంగా బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. మూడవ రోజు శనివారం రాత్రి శ్రీరంగనాథస్వామి సతీ సమేతుడై శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉద యం ప్రధాన అర్చకులు కృష్ణరాజేష్ శర్మ ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య సంఘ సభ్యులచే విశేష పూజలు జరిపించారు. రాత్రి తిరుణాల ప్రాంగణంలో గాలివీడుకు చెందిన నాగేశ్వరరావు బృందంచే సాసల చిన్నమ్మ కథ నిర్వహించారు.

ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు


ఆలయంలో ప్రతిష్ఠించిన యల్లమ్మతల్లి విగ్రహం

పులివెందుల రూరల్ : పట్టణంలోని యర్రగుడిపల్లెలో యల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను ఆలయ నిర్వాహకులు ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాలు రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. వైఎస్ కుటుంబ సభ్యులు, దాతల సహాయంతో ఆలయ నిర్మాణాలు చేపట్టామన్నారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం చెక్క భజనలు, నృత్యాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు.

వైఎస్సార్ జలకళతో రైతుల్లో ఆనందం


జలకళ ద్వారా అంకాలమ్మ గూడూరులో బోరు వేస్తున్న దృశ్యం

సింహాద్రిపురం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి రైతు కళ్లలో ఆనందం చూడాలన్న లక్ష్యంతో వైఎస్సార్ జలకళను ప్రవేశపెట్టారు. అందులో భాగంగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రత్యేక చొరవతో అంకాలమ్మగూడూరు గ్రామానికి వైఎస్సార్ జలకళ కింద 54 ఉచిత బోర్లు మంజూరు కాగా ఇందులో 42 పూర్తి అయ్యాయి. గ్రామానికి చెందిన రామలక్ష్మ అనే రైతు పొలములో శుక్రవారం బోరు వేయగా 795 అడుగులలో బుగ్గ పడటంతో రైతు ఆనందానికి అవదులు లేకుండా పోయాయి. దీంతో గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేద్దాం


సమావేశంలో పాల్గొన్న చైర్మన్ వరప్రసాద్

పులివెందుల టౌన్ : మార్చి 3వ తేదీన నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కోర్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పోలియో కార్యక్రమం నిర్వహించే రోజు వలంటీర్లు, మెప్మాసిబ్బంది, ఎస్‌హెచ్‌జీ గ్రూపులు తప్పకుండా పాల్గొని తమవంతు కృషి చేయాలన్నారు. 0–5 చిన్నపిల్లలందరికి పోలియో చుక్కలు వేసేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్ చైర్మన్ హాఫీజ్, మెడికల్ ఆఫీసర్ శాంతికుమార్, వైద్యులు ప్రత్యూష, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షిర్డిసాయినాథునికి పాలాభిషేకం

పులివెందుల టౌన్ : పట్టణంలోని పార్నపల్లె రోడ్డులోని శ్రీషిర్డిసాయిబాబా ఆలయంలో శనివారం మాఘశుద్ధ పౌర్ణమిని పురష్కరించుకుని బాబావారికి 108 బిందెల పాలాభిషేకం చేశారు. ఆలయ ధర్మకర్త శ్రీరాం దంపతులు ముందుగా బాబాకు పాలు తీసుకుని వచ్చి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు మురళీధర నంబుద్రి భక్తులతో ప్రతి ఒక్కరి చేతులమీదుగా సాయిబాబా విగ్రహానికి పాలాభిషేకం చేయించారు. పెద్ద సంఖ్యలో భక్తులు బారులు తీరారు. ఆలయంలో దత్తాత్రేయుని హోమాలు శాస్త్రోక్తంగా హోమాలు నిర్వహించారు.

చెన్నూరు : స్థానిక ఆంజనేయపురం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో వెలసిన శ్రీ లక్ష్మీ సత్యనారాయణస్వామి ఆలయంలో శనివారం మాఘ పౌర్ణమి పురస్కరించుకుని సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను ఆలయాల కమిటీ నిర్వాహకులు నిర్వహించారు. భక్తులు సతీ సమేతంగా వ్రతంలో పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

ముద్దనూరు : తెలంగాణ రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న 21 మద్యం సీసాలను శనివారం స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకుని ఇరువురిని అరెస్టు చేసినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. తొండూరు మండల ఇనగనూరు గ్రామానికి చెందిన గంగ సురేంద్రరెడ్డి, గురు ప్రశాంత్‌రెడ్డిలు 21 మద్యసీసా(750 ఎంఎల్)లను రైలులో తీసుకొస్తుండగా కొత్త రైల్వేస్టేషన్ రోడ్డు వద్ద వారిని అదుపులోకి తీసుకుని మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

కొండాపురం : మండలంలోని వెంకయ్యకాలువ గ్రామంలో నూతన ఆజంనేయస్వామి ఆలయంలో ధ్వజ శిఖర కలశ నూతన విగ్రహ ప్రతిష్ఠ శనివారం వేదపడితులతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. పొట్టిపాడు గ్రామానికి చెందిన చింతరాజారెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీల్లో రంగాపాయిపల్లె గ్రామానికి చెందిన మార్తల వెంకటసుబ్బారెడ్డి ఎద్దులు 5100 అడుగులు లాగి మొదటి బహుమతి రూ.40 వేలు, ప్రకాశం జిల్లా గంగన్నపాలెంకు చెందిన ఉమ్మరెడ్డి శ్రీవల్లికి చెందిన ఎద్దులు 4957 అడుగులు లాగి ద్వితీయ బహుమతి రూ.30 వేలు, మాసనపల్లెకి చెందిన సాకం బ్రహ్మానందరెడ్డి ఎద్దులు 4800 అడుగులు లాగి తృతీయ బహుమతి పొందారు.

విద్యార్థులు అంకితభావంతో ముందుకుపోవాలి


కళాశాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జీఎన్‌డీ సొల్యూషన్ వెంకటశివారెడ్డి తదితరులు

పులివెందుల టౌన్ : విద్యార్థులు పట్టుదల, అంకితబావంతో తమ గమ్యాన్ని చేరుకోవడానికి చక్కగా చదివి ముందుకు పోవాలని బెంగుళూరు జీఎన్‌డీ సొల్యూషన్ వెంకటశివారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక లయోలా పాలిటెక్నిక్(వైఎస్ఆర్ఆర్) కళాశాల 44వ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యపట్ల మంచి పట్టుసాధించినప్పుడే దేనినైనా సాధించేందుకు వీలుంటుందన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన ఆదిత్య బిర్లా ఫ్యాషన్ మేనేజింగ్ డైరెక్టర్ జయకుమార్ విద్యార్థులను, కళాశాలను ఉద్దేశించి ప్రసంగించారు. సమాజ సేవచేయడంలో ప్రతి ఒక్కరు ముందుండాలని సూచించారు. కరస్పాండెంట్ ఫాధర్ ఆంటోనిస్వామి, కళాశాల ప్రిన్సిపాల్ బ్రిట్టోలు విద్యార్థునుద్దేశించి ప్రసంగించారు. అనంతరం కళాశాల బ్రోచర్‌ను విడుదల చేశారు. అలాగే చదువులపట్ల మంచి ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులతోపాటు మెమెంటోలను అందజేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి


విలేకరులతో మాట్లాడుతున్న ఓబాయపల్లె నాయకులు

వీరపునాయునిపల్లె : తెలుగుదేశం పార్టీ నాయకులు దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని అలిదెన మాజీ సర్పంచు వాసుదేవరెడ్డి, అలిదెన ఓబాయపల్లె గంగాధర్‌లు తెలిపారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు విలేరకులతో మాట్లాడారు. ఓబాయపల్లె గంగాధర్ మాట్లాడుతూ గత పంచాయతీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు చేపట్టిన కుంత్రాలు, కుట్రల వలన చాలా మంది పార్టీని వీడటం జరిగిందన్నారు. ఆరోజు మా ఎమ్మెల్యే సమావేశం ఏర్పాటు చేసి పార్టీ తరపున పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలని లేక పోతే పార్టీని వీడి వెళ్లిపోవచ్చని ఆదేశించడంతో కొందరు పార్టీలోంచి వెళ్లడం జరిగిందన్నారు. మా పార్టీనుంచి వెల్లిన వారందరూ ఓట్లు వేయడంతో వారు పంచాయతీ ఎన్నికల్లో గెలిచారన్నారు. అయితే వారు మళ్లీ సొంతపార్టీలోకి రావడంతో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించామన్నారు. మీ లాగా తప్పుడు ప్రచారాలు చేసుకోలేదన్నారు. ఓబాయపల్లె, అలిదెన, ఈర్లపల్లె గ్రామాలకు చెందిన నాయకులందరూ తెలుగుదేశం పార్టీలో చలామణి అవుతూ తిరిగి లోకేష్ సమక్ష్యంలో పార్టీలో చేరినట్లు కండువాలు వేసుకుంది మీరు కాదా అని ప్రశ్నించారు. దమ్ము ధైర్యం ఉంటే రాబోవు ఎన్నికల్లో మెజార్టీ తెస్పుకోవాలని సవాల్ చేశారు. సమావేశంలో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, వీరపునాయునిపల్లె ఎంపీటీసీ రాఘవయాదవ్, పీరూసాహెబ్, గంగాధర, గంగన్న, మహేశ్వర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, గోవిందురెడ్డి, శ్రీనివాసుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యుల పట్ల ఆదరణ చూపిన ఎస్ఐ


అభి ట్రస్ట్ వాహనంలో అభాగ్యులను తరలిస్తున్న ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి

కమలాపురం : అభాగ్యుల పట్ల ఆదరణ చూపి మానవత్వం చాటుకున్నారు కమలాపురం ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి. పట్టణంలో ఎటు వెళ్లాలో తెలియక రోడ్లపై ఉంటూ నడవలేని స్థితిలో ఉన్న ఒక అభాగ్యుడిని, అలాగే ఒంటరిగా జీవిస్తూ అనారోగ్యంతో బాధపడుతున్న మరో వ్యక్తిని ఎస్ఐ శనివారం ఎర్రగుంట్ల మండలం తిప్పలూరులోని ఎద్దుల పెద్ద శేషమ్మ వృద్ధాశ్రమంలో చేర్పించారు. స్థానికుల ద్వారా అభాగ్యుల పరిస్థితి తెలుసుకున్న ఎస్ఐ అభి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజయ్‌బాబు, వలంటీర్ శ్యాంబాబుల సహకారంతో వారిని వృద్ధాశ్రమంలో చేర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎద్దుల పెద్ద శేషమ్మ వృద్ధాశ్రమం యాజమాన్యం సేవలు ప్రశంసనీయం అన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక సేవ పట్ల శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ భవానీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రతికుటుంబానికి లబ్ధి

జమ్మలమడుగు : ప్రభుత్వ సంక్షేమపథకాలతో ప్రతి కుటుంబం లబ్ధి పొందిందని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని 15 వార్డులో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈడిగిపేటలోని బురుజు వద్ద ప్రజల వద్దకు వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమపథకాలతో ప్రజలు పొందిన లబ్ధిని వివరించి అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత జగనన్న ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చారని ఈ హామీలతో ప్రజలు లబ్ధిపొంది ఉంటేనే నాకు ఎమ్మెల్యేగా మరో అవకాశం కల్పించాలని ఆయన ప్రజలను కోరారు. నియోజకవర్గంలో అత్యధికంగా చేనేత కార్మికులు వున్నారని వారికి ఏడాదికి రూ.24వేలు వైఎస్సార్ నేతన్ననేస్తంతోపాటు 50 సంవత్సరాలు నిండిన చేనేత కార్మికులకు పెన్షన్ అందుతోందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, హస్తకళల అభివృద్ధి చైర్మన్ విజయలక్ష్మీ, వైస్ చైర్మన్ సింగరయ్య, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస గోవిందా.. శ్రీవేంకటేశ గోవిందా


పులివెందుల పురవీధులలో కదులుతున్న రథోత్సవం


వల్లూరులో కల్యాణ క్రతువును నిర్వహిస్తున్న వేద పండితులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీవేంకటరమణుడి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేంకటరమణుడు శనివారం సతీమేతుడై బ్రహ్మరథంపై కొలువుతీరి భక్తులకు దర్శనమిచ్చారు. రథోత్సవాన్ని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ప్రారంభించారు. భక్తులు రథానికి (తేరు) ఉన్న తాళ్లను పట్టుకుని ముందుకు కదిలించారు. తిరుమల మాడవీధులను తలపించేలా కనువిందుచేసింది.

మహిళా భక్తులు ఎక్కువశాతం తేరును లాగారు. ఆలయం వద్ద నుంచి మెయిన్‌బజార్, పూలంగళ్ల సర్కిల్, పాతగంగిరెడ్డి ఆసుపత్రి రోడ్డు, ముత్యాల వీధి, శ్రీకృష్ణదేవరాయ నగర్, అమ్మవారిశాల మీదుగా స్వామివారి బ్రహ్మరథోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఎటువంటి ఆవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పర్యవేక్షించారు. రథోత్సవంలో వెంకటేశ్వరస్వామి వేషదారణలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. దారిపొడవునా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పులిహోర, పెరుగుఅన్నం ప్రసాదాలతోపాటు మజ్జిగ, కూల్‌డ్రింక్స్ అందించారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధర్‌రెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జిలు పార్నపల్లె కిషోర్, చంద్రమౌళి, కోడిరమణ, కోఆప్షన్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం చెన్నకేశవస్వామి కల్యాణం

వల్లూరు : పైడికాలువలోని చెన్నకేశవస్వామి ఆలయంలో మూడోరోజు శనివారం జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వాముల కల్యాణోత్సవం ఆలయ ప్రధాన అర్చకులు స్వామి హరినారాయణ ఆధ్వర్యంలో కమనీయంగా జరిగింది. ముత్యాల తలంబ్రాల కార్యక్రమాన్ని చూసిన భక్తులు తరించిపోయారు. మాలా పరివర్తన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కోలాట ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఉదయం రాజ శ్యామల యాగాన్ని, వివిధ హోమాలను నిర్వహించారు. మహా పూర్ణాహుతి అనంతరం బ్రహ్మ కళశ నయనము, సహస్ర కుంభాభిషేకం, పరిదేవతా అభిషేకంలను నిర్వహించారు. అనంతరం స్వామివారి మూల మూర్తులకు అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలయ్య, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్రీడలతో క్రమశిక్షణ, నైపుణ్యాభివృద్ధి

వేంపల్లె : క్రీడలతో క్రమశిక్షణ, నైపుణ్యాభివృద్ధి పొందవచ్చని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. శనివారం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో స్పోర్ట్స్ మీట్ వార్షికోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి క్రీడల్లో రాణించి తమ ప్రతిభను చూపాలని, మానసిక ఒత్తిడిని జయించేందుకు క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని.. ఆదిశగా విద్యార్థులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ రామభూపాల్‌రెడ్డి, అకాడమిక్ డీన్ రత్నకుమారి, వ్యాయామ విభాగం పీడీలు షంషాద్, బాలఓబయ్య, రమణారెడ్డి పాల్గొన్నారు.

కల్యాణానికి ఆహ్వాన రథం ప్రారంభం


పంచకళ్యాణి రథాన్ని ప్రారంభిస్తున్న ఆలయ అభివృద్ధి కమిటీ బృందం

చక్రాయపేట : స్థానిక శ్రీవేంకటేశ్వర రాచరాయస్వామి ఆలయాల ఆవరణలో మహాశివరాత్రి నాడు ఒకే వేదికపై జరిగే శ్రీలక్ష్మీ వేంకటేశ్వరుడు, శివపార్వతుల కల్యాణానికి ప్రతి ఇంటికీ వెళ్లి పిలిచేందుకు పంచకల్యాణి రథాన్ని శనివారం ఆలయ కమిటీ చైర్మన్ మోపూరి రామాంజనేయరెడ్డి ప్రారంభించారు. రథంపై ఉత్సవ మూర్తుల విగ్రహాలను ఉంచి మండలంలోని ప్రతి గ్రామంలో ప్రతి ఇంటివద్దకు వెళ్లి కల్యానానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో కులమతాలకు అతీతంగా ప్రతి కుటుంభ సభ్యులను ఆహ్వానించామన్నారు. గోవింద నామాలు, శివనామస్మరణతో రథం ఊరూరా తిరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

పలువురు వైఎస్సార్‌సీపీలో చేరిక


పార్టీలోనికి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : కొండాపురం గ్రామానికి చెందిన వల్లెపు శ్రీను ఆధ్వర్యంలో పలువురు శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలోకి చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ గెలుపునకు ప్రతి ఒక్కరు తమవంతు బాధ్యతగా కృషి చేయాలని తెలిపారు. కొండాపురం ముంపువాసులకు రూ.3.25లక్షలకు సంబంధించిన నిధులు కూడా మంజూరయ్యాయన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలుపు కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

రేపు మదరసాలో అభివృద్ధి పనులు ప్రారంభం


సమావేశంలో మాట్లాడుతున్న ట్రస్ట్ ప్రెసిడెంట్ అబ్దుల్ మౌలానా

పులివెందుల : పులివెందులలో రూ.59 లక్షలతో మదరసాలో అభివృద్ధిపనులు పూర్తయ్యాయని వీటిని ఈనెల 26న కడప ఎంపీ అవినాష్‌రెడ్డి ప్రారంభిస్తారని మదరసా దారుల్ ఉలూమ్ తన్వీరుల్ హుదా(ట్రస్ట్) ప్రెసిడెంట్ అబ్దుల్లా మౌలానా తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పులివెందులలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2008లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింలపై అభిమానంతో ఆ కాలంలోనే ఏడు ఎకరాల భూమిని అరబిక్ కళాశాల కోసం నిధులు ఖర్చుచేశారన్నారు.

తర్వాత కూడా మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలు మదరస సంక్షేమం కొరకు, మదరసా పిల్లల కోసం కాంపౌండ్‌వాల్, సీసీ రోడ్లకు ప్రభుత్వం నుంచి రూ.59 లక్షలు మంజూరు చేయించి అభివృద్ధి పనులు పూర్తిచేయించారన్నారు. మదరస అభివృద్ధికి సహకరించిన వైఎస్ కుటుంబ సభ్యులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వైఎస్ మధుసూదన్‌రెడ్డి, వేల్పుల వైఎస్సార్ సీపీ నాయకులు రాము, నూర్‌బాషా, ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రసూల్, వైఎస్సార్ సీపీ ముస్లిం నాయకులు నూరుల్లా, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, కౌన్సిలర్లు ఖాదర్‌బాషా, సిద్దయ్య, మస్తాన్ ముత్తవల్లి, ఉలుమాలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణ వ్రతం

వేంపల్లె : స్థానిక కడపరోడ్డులోని షిర్డీసాయిబాబా ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఘనంగా నిర్వహించినట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు. శనివారం మాఘపౌర్ణమి సందర్భంగా అర్చకులు శంకర మంచి ప్రసాద్‌శర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామికి అభిషేకం, పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. అలాగే భక్తులకు అన్నదానం ఏరాటుచేశారు.

ముస్లింల పక్షపాతి సీఎం జగన్

వేంపల్లె : ముస్లింల నిజమైన పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని హజ్ కమిటీ డైరెక్టర్ మునీర్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని ముస్లింల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. అలాగే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఇప్పటికే వైఎస్సార్ సీపీ నుంచి 6 మంది ముస్లింలను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడం హర్షనీయమన్నారు. అలాగే టీడీపీ తన 94 స్థానాల్లో కేవలం 1 స్థానాన్ని ముస్లింలకు కేటాయించడం చూస్తే ఏపార్టీ ముస్లింలకు అండగా, తోడుగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. దివంగత నేత వైఎస్సార్ ముస్లింల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు.

మట్కా బీటర్ల అరెస్టు

ముద్దనూరు : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో శనివారం నూర్‌బాషా, షబ్బీర్ అనే మట్కాబీటర్లను అరెస్టు చేసి వారి వద్దనుంచి రూ.20,100 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు.